క్లుప్తంగా

ఆంజనేయస్వామికి విశేష పూజలు



విశేషాలంకరణలో ఆంజనేయస్వామి

పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న వీర అభయాంజనేయస్వామికి అర్చకులు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు, ప్రత్యేక పూజలు, సాయంత్రం స్వామికి పల్లకి సేవ గావించారు.

అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట



మనుబోలు : మండలంలోని లక్ష్మీనరసింహాపురం గ్రామంలో మంగళవారం అభియాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. అర్చకుడు సాయిశర్మ పర్యవేక్షణలో 20 అడుగుల అభయాంజనేయ స్వామి విగ్రహాన్ని ప్రతిష్టించారు. తొలుత స్వామివారి పటాన్ని గ్రామోత్సవం నిర్వహించి ఇంటింటికీ కాషాయ జెండాలను పంపిణీ చేశారు. అనంతరం విఘ్నేశ్వరపూజ, వేదపారాయణం, క్షేత్రపాలక, వాస్తు పూజ, నవగ్రహ ప్రధాన మండప దేవతా పూజలు, అగ్నిప్రతిష్ట, దీక్షా హోమం, జలాధివాసం, క్షీరాధివాసం, పూర్ణాహుతి చేసి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం జరిపించారు. ఎంపీటీసీ గుమ్మడి వెంకటసుబ్బయ్య కార్యక్రమాలను పర్యవేక్షించారు.

వైభవంగా కోదండరాముని రథోత్సవం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : పట్టణంలోని కోదండరామాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కోదండరాముని రథోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజల అనంతరం రథంపై పట్టణ వీధుల్లో ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

జనరంజక పాలనకు మద్దతివ్వండి



తిక్కవరప్పాడులో మంత్రి కాకాణికే మా ఓటు అంటున్న మహిళలు

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం : రాష్ట్రంలో జనరంజక పాలనకు ప్రజలు మరోసారి మద్దతు ఇవ్వాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కోరారు. మండలంలోని తిక్కవరప్పాడు, జోసఫ్‌పేట, పుంజులూరుపాడు, గుడ్లూరువారిపాళెం, తిరుమలమ్మపాళెం గ్రామాల్లో మంత్రి కాకాణి మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి కాలనీలో ప్రజలు మంత్రి కాకాణికి పూలు, కర్పూర హారతులతో స్వాగతం పలికారు. మహిళలు స్వచ్ఛందంగా బయటకు వచ్చి జగనన్న పాలనలో ఎన్నడూ లేనివిధంగా సంక్షేమ పథకాలు పొందామని తమ ఆనందాన్ని వెలిబుచ్చారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ ప్రజలు ఓటు వేసేందుకు వెళ్లే ముందు ఎవరు అభివృద్ధి చేశారో ఆలోచన చేయాలని సూచించారు. సర్వేపల్లి నియోజకవర్గంలో గతంలో ఎవరూ చేయని అభివృద్ధి పనులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తాను చేయించినట్లు వివరించారు. గత టీడీపీ ప్రభుత్వంలో మంత్రిగా వెలగబెట్టిన సోమిరెడ్డి ఇష్టారాజ్యంగా దోచుకోవడం తప్ప, అభివృద్ధి, సంక్షేమం గురించి ఎక్కడా పట్టించుకున్న దాఖలాల్లేవన్నారు. కరోనా కష్టకాలంలోనూ తాను ప్రజల్లోనే తిరుగుతూ రూ.3 కోట్ల విలువైన ధాన్యం, ఇతర నిత్యావసర వస్తువులను ప్రజలకు పంపిణీ చేస్తే, సోమిరెడ్డి కరోనాకు భయపడి హైదరాబాద్‌లో దాక్కున్నాడని పేర్కొన్నారు. ఏళ్ల తరబడి రైతులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు పంపిణీ చేసి హక్కులు కల్పించడంతో రైతులు చాలా సంతోషంగా ఉన్నారని తెలియజేశారు. తిక్కవరప్పాడులో సర్వే నంబర్ 2193కు సంబంధించి 208 ఎకరాలపై రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సాగు చేసుకునే ప్రతి ఒక్కరికీ పట్టాలు పంపిణీ చేస్తామన్నారు. పుంజులూరుపాడు, గుడ్లూరువారిపాళెం రైతులు కామినేని చెరువు భూములను సాగు చేసుకుంటుంటే దీనిని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రైతులకు పట్టాలు పంపిణీ చేశామని వివరించారు. నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేశానని, మరోసారి అవకాశమిస్తే ప్రజల రుణం తీర్చుకునేలా పనిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ నలగర్ల భారతి, సర్పంచ్ చిరంజీవి, వైఎస్సార్‌సీపీ నాయకులు నలగర్ల నరసింహారావు, మంచు వెంకటేశ్వర్లు నాయుడు, శ్రీనివాసులు నాయుడు, దొడ్డక గోపి, నలగర్ల రంగయ్య, నలగర్ల వెంకటరమణయ్య, నోసిన రంగయ్య, రమణయ్య, బాలయ్య నాయుడు, సుబ్బనాయుడు, చంద్రారెడ్డి, రాజాగౌడ్, రౌతు మల్లికార్జున, ముంగర శ్రీనివాసులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథి సీఎం జగన్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట : దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో వినూత్న పథకాలను అమలు చేసి సంక్షేమ సారథిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని డేవిస్‌పేటలో ఆయన మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఐదేళ్లలో డేవిస్‌పేటలో డీబీటీ ద్వారా రూ.6.66 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా రూ.2.22 కోట్ల నగదును అందించినట్లు తెలిపారు. కరోనా కష్టకాలంలో కూటమి నాయకులు కనీసం ప్రజలను పలకరించిన పాపాన పోలేదని దుయ్యబట్టారు. టీడీపీని నమ్ముకున్న వారికి మొండిచేయి మిగిలిందని, డబ్బున్న వారికే ఆ పార్టీలో టికెట్ దక్కిందన్నారు. డబ్బుతో ప్రజలను కొనలేరని, గతంలో ఎంతో మంది కోటీశ్వరులను కోవూరు ప్రజలు తరిమికొట్టిన విషయాన్ని గుర్తుచేశారు. జగన్ పేదలను నమ్ముకున్నారని, ఆయన ముఖ్యమంత్రిగా ఉండడం రాష్ట్రానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. బాబు, పవన్‌కు ప్రజల బాగోగులు పట్టవని, దోచుకోవడం, దాచుకోవడం మాత్రమే వారికి తెలుసన్నారు. రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనకు, ఎంపీగా విజయసాయిరెడ్డికి ఓట్లు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ ఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, జొన్నవాడ ఆలయ చైర్మన్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, ఇందుకూరుపేట కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ గునుపాటి సురేష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు బట్టేపాని నరేంద్రరెడ్డి, మేనాటి ప్రసాద్‌రెడ్డి, నెల్లూరు వెంకట రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి

- ఏడీఏ లక్ష్మీమాధవి



రైతులకు అవగాహన కల్పిస్తున్న లక్ష్మీమాధవి

కొడవలూరు : ఎడగారులో రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ లక్ష్మీమాధవి సూచించారు. మండలంలోని కొడవలూరు, తలమంచి, గుండాలమ్మపాళెం, వెంకన్నపురంలో ఎడగారులో సాగు చేయాల్సిన పంటలపై రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా నీటి లభ్యత తక్కువగా ఉన్నందున ఆరుతడి పంటలైన పెసర, నువ్వులు, మినుము, జొన్న, మొక్కజొన్న, సజ్జ తదితర పంటలను వేసుకోవాలన్నారు. లేనిపక్షంలో పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, పిల్లిపెసర, జనుము పంటలు వేసుకోవాలన్నారు. తద్వారా భూసారాన్ని పెంపొందించుకోవడంతో పాటు నేల గుల్లబారుతుందన్నారు. దీనివల్ల తరువాత వేసే పంటల్లో అధిక దిగుబడులు సాధించవచ్చని వివరించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏఓలు వాసు, మధురిమ, ఏఈఓ ఎ.అనూష, వీఏఏలు శివజ్ఞాన, విష్ణుప్రియ, లిఖిత, ప్రసాద్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు



అరుంధతీయవాడలో వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో మంత్రి కాకాణి

వెంకటాచలం : మండలంలోని తిక్కవరప్పాడు గ్రామ పంచాయతీలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మంగళవారం తిక్కవరప్పాడులో పర్యటించారు. ఇటీవల గ్రామంలో టీడీపీలోకి చేరికలంటూ సోమిరెడ్డి ప్రకటించిన కుటుంబాలు మంత్రిని కలిసి తామంతా టీడీపీలో కొనసాగలేమని చెప్పారు. మోసపూరిత మాటలతో ప్రలోభాలకు గురిచేసి పార్టీలో చేరినట్లుగా ప్రకటించుకున్నారని మంత్రి కాకాణికి తెలియజేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో తమ కుటుంబాలకు అందిన సంక్షేమ పథకాలతో లబ్ధి పొందామని, వైఎస్సార్‌సీపీలోనే కొనసాగుతామని చెప్పారు. వీరితో పాటుగా తిక్కవరప్పాడు మిక్స్‌డ్ కాలనీలో 40 కుటుంబాలు, అరుంధతీయవాడలో 20 కుటుంబాలు, కండ్రిగ హరిజనవాడలో మరో 20 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి మంత్రి కాకాణి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

మంత్రి కాకాణి ఎన్నికల ప్రచారం నేడు

తోటపల్లిగూడూరు : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మండల పరిధిలో బుధవారం ఎన్నికల ప్రచారం చేస్తారని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు ఉప్పల శంకరయ్యగౌడ్ మంగళవారం తెలిపారు. బుధవారం సాయంత్రం 4 గంటలకు పేడూరు, 5.30 గంటలకు కొత్తపాళెం, 7 గంటలకు పొట్లపూడి పంచాయతీల్లో మంత్రి తన ఎన్నికల ప్రచారం సాగిస్తారన్నారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నేడు ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం

కోవూరు : మండలంలోని లేగుంటపాడు, పోతిరెడ్డిపాళెం గ్రామాల్లో కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు, నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి బుధవారం ఎన్నికల ప్రచారం చేస్తారని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం తెలిపారు. ఉదయం ఏడు గంటలకు లేగుంటపాడు, సాయంత్రం మూడు గంటలకు పోతిరెడ్డిపాళెం గ్రామాల్లో ప్రచారం జరుగుతుందన్నారు.

బీసీ వసతిగృహాల్లో 86.68 శాతం ఉత్తీర్ణత

నెల్లూరు(వీఆర్సీసెంటర్): పదో తరగతి పరీక్షల్లో జిల్లాలోని బీసీ వసతి గృహాల విద్యార్థులు 86.68 శాతం ఉత్తీర్ణత సాధించారని బీసీ సంక్షేమాధికారి వెంకటయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 631 మంది హాజరుకాగా, 547 మంది ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు. వీరిలో 404 మంది ఫస్ట్ క్లాస్.. 93 మంది సెకండ్ క్లాస్.. 50 మంది థర్డ్ క్లాస్‌లో పాసయ్యారని చెప్పారు. 54కు గానూ 18 వసతి గృహాల్లోని విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించారని వివరించారు. ఆత్మకూరులోని బీసీ బాలికల వసతి గృహానికి చెందిన సాదియా 586 మార్కులను సాధించిందన్నారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం



ప్రత్యేకాలంకరణలో సీతారాములు

పొదలకూరు : పట్టణంలోని రామమందిరంలో మంగళవారం రాత్రి వందలాది మంది భక్తజన సందోహం మధ్య సీతారాముల కల్యాణం కమనీయంగా సాగింది. ఉభయకర్తలుగా కోనం బ్రహ్మయ్య, వూకోటి వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ వ్యవహరించారు. రామమందిరం, తొగటివీధి, యాదవవీధి, పద్మావతినగర్, వినాయక మాన్యం కాలనీల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఉభయకర్తలు భక్తులకు అన్నప్రసాదాలు ఏర్పాటు చేశారు.

మహిళల ఆందోళన



మనుబోలు : రెండు కుటుంబాల మధ్య తలెత్తిన గొడవకు సంబంధించి ఎస్సై అజయ్‌కుమార్ తమకు న్యాయం చేయలేదని మాల మహాసభ ఆధ్వర్యంలో స్థానిక దళిత మహిళలు మంగళవారం పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేశారు. మనుబోలు అంబేడ్కర్ నగర్‌కు చెందిన కుమారికి పక్కనే ఉన్న వెంకటేష్ కుటుంబంతో కొంత కాలంగా గొడవలు ఉన్నాయి. ఈ క్రమంలో వెంకటేష్ తనపై దాడి చేశాడని కుమారి పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై తమకు న్యాయం చేయలేదంటూ మాల మహాసభను ఆశ్రయించారు. ఈ సందర్భంగా మాల మహాసభ అధికార ప్రతినిధి నాగూరు మరియమ్మ మాట్లాడుతూ కుమారి పట్ల ఎస్సై దురుసుగా ప్రవర్తించాడని ఆరోపించారు. దీనిపై తాము ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. కాగా ఎస్సై అజయ్‌కుమార్‌ను వివరణ కోరగా కుమారి, వెంకటేష్ కుటుంబాల మధ్య ఇప్పటికే మూడుసార్లు గొడవలు జరిగి దాడులకు పాల్పడడంతో ఇద్దరినీ మందలించానని తెలిపారు. ప్రత్యేకంగా కుమారి పట్ల దురుసుగా ప్రవర్తించలేదన్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడి మృతి

నెల్లూరు(క్రైమ్): బైక్ అదుపుతప్పడంతో తీవ్రంగా గాయపడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. నార్త్ ట్రాఫిక్ పోలీసుల సమాచారం మేరకు.. ఏఎస్‌పేట మండలం చౌటభీమవరానికి చెందిన లక్ష్మీనారాయణ, జ్యోతి దంపతులకు కిశోర్ (19), కుమార్తె ఉన్నారు. ఉపాధి నిమిత్తం కొంతకాలం క్రితం నెల్లూరొచ్చిన వీరు శెట్టిగుంటరోడ్డులో నివాసం ఉంటున్నారు. స్థానికంగా ఉన్న సెలూన్‌లో పనిచేస్తూ కుటుంబాన్ని కిశోర్ పోషించసాగారు. ఈ తరుణంలో తెలిసిన వారి బైక్ తీసుకొని నగరంలోకి మంగళవారం బయల్దేరారు. ఫ్లయ్‌ఓవర్‌పైకి చేరుకునేసరికి బైక్ అదుపుతప్పడంతో కిందపడ్డారు. కిశోర్ తలకు తీవ్రగాయం కావడంతో చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ కొద్దిసేపటికే మృతి చెందారు. ఈ మేరకు నార్త్ ట్రాఫిక్ పోలీసులకు కుటుంబసభ్యులు సమాచారం అందించారు. హస్పిటల్‌కు చేరుకొని మృతదేహాన్ని ఎస్సై గీతారమ్మ పరిశీలించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి, సంక్షేమమే గెలిపిస్తాయి



పొదలకూరు : ఎన్నికల ప్రచారంలో పూజిత



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ఎన్నికల ప్రచారంలో గీతారెడ్డి, పూజారెడ్డి

పొదలకూరు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే తన తండ్రిని గెలిపిస్తాయని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె పూజిత పేర్కొన్నారు. మండలంలోని తాటిపర్తి గ్రామంలో ఇంటింటి ఎన్నికల ప్రచారాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన తండ్రి తాటిపర్తి పంచాయతీలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. సిమెంటురోడ్లు, సైడ్ డ్రెయిన్లను రూ.కోట్ల నిధులు వెచ్చించి పూర్తి చేయించినట్టు చెప్పారు. తాటిపర్తి పంచాయతీ తమకు సొంత గ్రామంతో సమానమన్నారు. గత ఎన్నికల్లో సైతం ఇక్కడి నుంచి మంచి మెజారిటీ సాధించినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, పార్టీ నేతలు పలుకూరు పోలిరెడ్డి, పామూరు లచ్చారెడ్డి, సీహెచ్ శ్రీహరి, పి.నారాయణరెడ్డి, జి.లక్ష్మీకల్యాణి, నీలం హనుమారెడ్డి, బి.సంతోష్‌రెడ్డి, డి.శ్రీనివాసులురెడ్డి, నంది శ్రీనివాసులురెడ్డి, అచ్చాల సుధాకర్‌రెడ్డి, ఆముదం సుధాకర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, సుధీర్, పార్థసారథిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం


పట్టణంలో రామమందిరం, తొగటవీధి, పద్మావతి నగర్ ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ఎన్నికల ప్రచారాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణికి ఓటు వేయాలని ఆయన బావ దేవిరెడ్డి రాఘవరెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. పట్టణంలో ఆయన చేసిన అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ప్రజలు ఓట్లు వేయాల్సిందిగా కోరారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి, వైస్ ఎంపీపీ సోమా అరుణ, జెడ్పీటీసీ తెనాలి నిర్మలమ్మ, కోనం బ్రహ్మయ్య, సర్పంచ్ చిట్టెమ్మ, మద్దిరెడ్డి రమణారెడ్డి, మొలబంటి శేఖర్‌బాబు, మలిశెట్టి శివశంకర్, అట్లా ప్రభాకర్‌రెడ్డి, ఆదూరు వెంకటసుబ్బయ్య, ఆకులూరు హేమంత్, దామిశెట్టి శ్రీనివాసులు, భారతమ్మ, మూర్తిరెడ్డి, తుమ్మల ప్రసాద్, ఆనందరావు పాల్గొన్నారు.

చెల్లాయపాళెంలో..

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని చెల్లాయపాళెం గ్రామంలో కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సతీమణి గీతారెడ్డి, కోడలు పూజారెడ్డి మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కోవూరు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఇంటింటికీ తిరిగి ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చెర్లో సతీష్‌రెడ్డి, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు

విడవలూరు : రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కిందని వైఎస్సార్‌సీపీ కోవూరు నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్ కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఊటుకూరు గ్రామంలో నల్లపరెడ్డి రాహిన్‌రెడ్డితో కలిసి మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కోవూరు ఎమ్మెల్యేగా ప్రసన్నకుమార్‌రెడ్డిని, నెల్లూరు ఎంపీగా వేణుంబాక విజయసాయిరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. అనంతరం జనసేన పార్టీకి చెందిన బద్వేలు సునీల్‌కుమార్‌తో పాటు మరికొందరు వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పూండ్ల అచ్యుత్‌రెడ్డి, పార్టీ మండల గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌రెడ్డి, స్థానిక నేతలు పొన్నాల కృష్ణారెడ్డి, లేబూరు రమేష్‌బాబు, కొండూరు సాగర్‌రెడ్డి, రమణారెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



పొదలకూరు : కరపత్రాలను అందజేస్తున్న నాయకులు



విడవలూరు : ఊటుకూరులో ప్రచారం చేస్తున్న రజత్‌కుమార్‌రెడ్డి

సత్ఫలితాలిస్తున్న విద్యా సంస్కరణలు

- నాడు–నేడు సౌకర్యాలతో పెరిగిన ఉత్తీర్ణత



నాడు–నేడు ద్వారా బాగుపడిన పొదలకూరు డీఎన్నార్ జెడ్పీహైస్కూల్





మండల టాపర్ సుకృత (579) స్నేహలత(576)

పొదలకూరు : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన విద్యా సంస్కరణలు సత్ఫలితాలను ఇస్తోంది. ఇప్పటికే మనబడి నాడు–నేడు ద్వారా పాఠశాలల్లో సకల సౌకర్యాలు కల్పించారు. దీనితో పాటు డిజిటల్ విద్య, ట్యాబ్‌ల పంపిణీ, ఇంగ్లిష్ మీడియం అమలు తదితరాలతో విద్యార్థుల పాస్ పర్సంటైల్ మెరుగుపడుతోంది. గతంతో పోల్చిచూస్తే ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం బాగా పెరిగింది. మండలంలో 11 జెడ్పీ హైస్కూళ్లు ఉన్నాయి. దాదాపుగా అన్ని పాఠశాలలు నాడు–నేడు కింద బాగుపడ్డాయి. ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 474 మంది పరీక్షలు రాయగా 389 మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు మొత్తం 695 మంది పరీక్షలు రాయగా 603 మంది ఉత్తీర్ణతతో 86.76 శాతం సాధించారు. ఇంచుమించుగా ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతంతో పాటు, మార్కులు సాధించడం విశేషం. తోడేరులో కాకాణి శేషమ్మ జెడ్పీహైస్కూల్‌కు చెందిన వి.సుకృత 579 మార్కులు సాధించి మండలంలో టాపర్‌గా నిలిచింది. పొదలకూరు డీఎన్నార్ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని కె.స్నేహలత 576, ఇనుకుర్తి జెడ్పీహైస్కూల్ ఎం.సోనియా 576 మార్కులు సాధించారు.

పర్యవేక్షణ పెరిగింది

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులపై పర్యవేక్షణ పెరగడంతో పాటు నాడు–నేడుతో వసతులు సమకూరడం వల్ల పిల్లలు చదువుకునేందుకు వీలు కలిగింది. దీనికి తోడు జగనన్న గోరుముద్దలో భాగంగా బలవర్థక ఆహారం, రాగిజావ అందజేయడం వల్ల విద్యార్థులు శారీరకంగా, మానసికంగా బలంగా తయారై ఉన్నత ఫలితాలు సాధిస్తున్నారు. భవిష్యత్తులో ప్రభుత్వ పాఠశాలల్లో మరింత ఫలితాలు పెరిగే అవకాశం ఉందని ఉపాధ్యాయులు అంటున్నారు.

విరువూరు హైస్కూల్లో నూరుశాతం ఉత్తీర్ణత

విరువూరు జెడ్పీహైస్కూల్ విద్యార్థులు టెన్త్ పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించినట్టు హెచ్‌ఎం పద్మజ పేర్కొన్నారు. 17 మంది పరీక్షలు రాయగా అందరూ ఉత్తీర్ణత సాధించారు. ఎ.భవ్యచరిత 569, పీవీ విజయకుమార్ 544, ఎం.మహాలక్ష్మి 529 మార్కులు సాధించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను మంగళవారం పాఠశాలలో అభినందించారు.

భళా.. బాలికోన్నత పాఠశాల



విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : నగర పంచాయతీ పరిధిలోని బెజవాడ బుజ్జమ్మ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం విద్యార్థినులను అభినందించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓ వెంకటరత్నం మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమష్టి కృషితో మెరుగైన ఫలితాలు సాధించినట్లు తెలిపారు. పాఠశాలలో 149 మంది విద్యార్థులకు 125 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. 35 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారని వివరించారు. సీహెచ్ లక్ష్మీకీర్తన, ఎస్‌కే ఆయేషా సిద్దిక 592 మార్కులు, కె.హరిణి 587, వర్షిత 586 మార్కులతో సత్తా చాటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుజాత, ఉపాధ్యాయుడు సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

టాపర్‌కు అభినందన



లాస్యను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ముత్తుకూరు : టెన్త్ పరీక్షల ఫలితాల్లో మండల టాపర్‌గా నిలిచిన లాస్యలహరి(581)ని ముత్తుకూరు జెడ్పీహైస్కూల్ హెచ్‌ఎం, ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు. విద్యార్థిని తల్లిదండ్రులను ఉపాధ్యాయులు సన్మానించారు. లాస్య మంచి మార్కులు సాధించేందుకు కృషి చేసిన ఉపాధ్యాయులను హెచ్‌ఎం అభినందించారు.